క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని 40 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం దారుణమని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్‌లు అన్నారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీగా వెళ్లి డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి కోరారు. జీతాలను పెంచడంతో పాటు ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే, సమ్మె మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా మహాలింగార్చన



లింగార్చన నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా సోమవారం అనివెట్టి మండపంలో మహా లింగార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ శాస్త్రోక్తంగా అర్చనాభిషేకాలు జరిపించారు.

కవి సమ్మేళనం



రచయిత్రి మాలతిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యువ రచయితల వేదిక ఆధ్వర్యంలో కవి సమ్మేళనం సోమవారం నిర్వహించారు. వేదిక వ్యవస్థాపకురాలు తంగి ఎర్రమ్మ ఆధ్వర్యంలో పలువురు రచయితలు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు కవితలను చదివారు. అనంతరం 'యాత్రా దర్శిని – చార్‌దామ్ యాత్రలో అనుభవాలు' పుస్తక రచయిత్రి పొట్నూరు మాలతిని సత్కరించారు. కార్యక్రమంలో గుడిమెట్ల గోపాలకృష్ణ, బలివాడ ధనుంజయ్, ఇప్పిలి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ శ్రీకాకుళంకు అవార్డులు



అవార్డులతో జామి భీమశంకర్ తదితరులు

శ్రీకాకుళం అర్బన్: జేసీఐ శ్రీకాకుళం మెయిన్‌కు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయని జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకుడు డా.జామి భీమశంకర్ అన్నారు. విశాఖపట్నంలోని ఒక హోటల్‌లో ఆదివారం రాత్రి జరిగిన మిడ్కాన్ జోన్ ఈవెంట్‌లో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యుల బృందానికి 17 ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయని పేర్కొన్నారు. ఈ అద్భుతమైన విజయపరంపర కొనసాగించి నిరంతర సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ కార్యదర్శి తమ్మినేని ఉషారాణి, జోన్ ఆఫీసర్ జేసీ బెండాళం వరలక్ష్మి, జేసీ జగదీష్, జేసీ పోషక్ కుమార్, జేసీ కల్యాణి పాల్గొన్నారు.

'పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ల రెమ్యూనరేషన్ చెల్లించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి తక్షణమే రెమ్యునరేషన్లు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో పాల్గొన్న చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, కస్టోడియన్లు, స్క్వాడ్‌లు, ఇన్విజిలేటర్లకు, అలాగే అలాగే ఏప్రిల్ మొదటి వారంలో జరిగిన పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, ఇతర సిబ్బందికి చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ కూడా ఇంతవరకు చెల్లించకపోవడం సరికాదన్నారు. అలాగే గత ఏడాది సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఈ ఏడాది చెల్లించడం ఎంతమాత్రం సరైన విధానం కాదని హరిప్రసన్న, కృష్ణారావు మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు డీఏలను ప్రభుత్వం ప్రకటించాలని, రావాల్సిన బకాయి డీఏలు, జీపీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చెవులకు చిల్లుపడేలా..!

- నగరంలో పెరుగుతున్న శబ్ద కాలుష్యం
- అవస్థలు పడుతున్న ప్రజానికం
- పట్టించుకోని అధికారులు



డీజే సెట్



ట్రాఫిక్‌లో హోరు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో శబ్ద కాలుష్యం విపరీతంగా పెరిగింది. అనేక రకాల సౌండ్‌లతో ప్రజలు విసిగిపోతున్నారు. మార్కెట్లో, వీధుల్లోనే కాదు చిన్న చిన్న సందుల్లో కుడా శబ్ద కాలుష్యం పెనుభూతంగా మారింది. ఎక్కడికక్కడ మైకులు పెట్టి వ్యాపారులు ప్రచారం చేస్తున్నారు. నిరంతరం వచ్చే సౌండ్స్ మాత్రమే కాకుండా శుభకార్యాల సమయంలో డీజేలు ఏర్పాటు చేస్తుండడంతో చుట్టుపక్కల శబ్దంతో నిండిపోతోంది. ఫలితంగా నగరవాసుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

హారన్లతో ఇబ్బందులు

కొన్ని రకాల వాహనాలకు ఎయిర్ హారన్లు ప్రస్తుతం ఒక తీవ్రమైన సమస్యగా మారాయి. ఇది కేవలం అసౌకర్యాన్ని మాత్రమే కాకుండా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తోంది. మినీ మైకుల శబ్దాలు సాధారణ శబ్దం కంటే ఎక్కువ డెసిబెల్స్‌తో ఉంటున్నాయని ప్రజలు అంటున్నారు. మార్కెట్లో జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో ఒకేచోట ఈ మైకుల శబ్దం తీవ్ర శబ్ద కాలుష్యానికి దారితీస్తోంది. అధిక శబ్దం వల్ల వినికిడి లోపం, రక్తపోటు, ఒత్తిడి, నిద్రలేమి, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులపై మరింత ప్రభావం చూపుతోంది. ఆకస్మాత్తుగా వచ్చే ఎయిర్ హారన్లు డ్రైవర్లు, పాదచారులను ఉలిక్కిపడేలా చేసి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. నివాస ప్రాంతాలకు దగ్గరగా ఉన్న మార్కెట్లో ఈ శబ్దం వలన రాత్రి సమయాల్లో ప్రజల నిద్రకు భంగం వాటిల్లుతోంది.



మినీమైక్ హోరుతో అమ్మకాలు

వాహనాల శబ్దాలు

వాహనాల శబ్ద కాలుష్యం కూడా నగరంలో ఎక్కువగానే ఉంది. వాహనాల వల్ల కలిగే శబ్ద కాలుష్యానికి తోడు కొందరు వాహన చోదకులు వాడే ఎయిర్ హారన్లు ప్రస్తుతం ఒక తీవ్రమైన సమస్యగా మారాయి. ఈ ఎయిర్ హారన్లు రద్దు చేయాల్సి ఉంటుంది. రద్దీ సమయాల్లో ఈ శబ్దం ఎక్కువగా ఉంటోంది. బస్సుల్లో, లారీల్లో వినియోగించే ఎయిర్ హారన్ల వలన వినికిడి శక్తి పోతోంది. శబ్ద స్థాయిలను కొలవడానికి డెసిబెల్ మీటర్లు వంటి పరికరాలు ఉపయోగించి, అధిక శబ్దానికి కారణమయ్యే వారిపై చర్యలు తీసుకోవాలి. శబ్దాలను నియంత్రించడానికి చట్టాలు, నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని సమర్ధవంతంగా అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారులు చొరవ చూపాలి



శబ్ద కాలుష్యం నియంత్రించడానికి అధికారులు చొరవ చూపాలి. అవగాహన కార్యక్రమాలు చేపడితే ప్రజల్లో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. సాంకేతిక పర్యవేక్షణ, ఫిర్యాదుల వ్యవస్థను సైతం పటిష్టం చేయాలి.

– టీవీ రవిశంకర్, ప్రజా సమస్యల వేదిక అధ్యక్షుడు

డయేరియా రహిత సమాజానికి కృషి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డయేరియా రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో స్టాప్ డయేరియా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి జులై 31 వరకు ఇంప్లిమెంటేషన్ ఫేజ్–2లో భాగంగా డయేరియా నివారణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. ముఖ్యంగా ఐదు ఏళ్లలోపు చిన్నారుల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్స్ ప్రతీ ఇంటికి పంపిణీ చేసినట్లు వివరించారు. పంచాయతీరాజ్ శాఖ సమన్వయంతో నీటి నాణ్యత పరీక్షలు చేయడం, ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ చేపట్టినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణు గోపాల్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.రామ్స్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం కాపాడాలి



లలితా సహస్ర పారాయణం చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: సనాతన ధర్మం కాపాడాలని, దేశభక్తి కలిగి ఉండాలని మైసూరుకు చెందిన సంతోష్‌కుమార్ ఘనాపాటి అన్నారు. స్థానిక బాపూజీ కళా మందిర్‌లో శృంగేరి ఉభయ జగద్గురువుల పరిపూర్ణ అనుగ్రహంతో అహం బ్రహ్మాస్మి గౌతమ్ నిర్వహణలో నగరంలో రెండోసారి జరుగుతున్న శంకర విజయంపై ప్రసంగాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయులు తమ సంప్రదాయాలను వీడకుండా ఉండాలని వైదిక ధర్మంలో ఉన్న గొప్పదనాన్ని వివరించారు. ముందుగా మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో పెంట రామచంద్రశేఖరశర్మ, అహం బ్రహ్మాస్మి వాలంటీర్ వాశిష్ట కార్తికేయశర్మ, గుమ్మా నగేష్, నిష్టల నర్సింహమూర్తి, మందుల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



విద్యార్థులకు డైరీలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు గ్రామ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు, డైరీలను సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో సమకూర్చిన డైరీలను విద్యార్థులకు అందజేశారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ పాఠశాలకు తమ వంతు సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, పి.గోవిందరావు, ఎం.అనూరాధ, కె.వెంకటరావు, పి.తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ భృతి మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

జి.సిగడాం: ఎంపీటీసీ సభ్యులకు 28 నెలలుగా అందాల్సిన గౌరవ భృతిని తక్షణమే మంజూరు చేయాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, డీఆర్‌వలస ఎంపీటీసీ కుమరాపు రమేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు జెడ్పీ సీఈవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలోనూ ఈ విషయంపై ఫిర్యాదు చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో జాడ ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు, దేవరవలస ఎంపీటీసీ తిరుమరెడ్డి లక్ష్మణరావు, బూటు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జి.సిగడాం: మండల వ్యవసాయ శాఖ అధికారిగా బెండు బాజ్జినాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పొందూరు మండల వ్యవసాయ శాఖ అధికారిగా పని చేసి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన యర్రా శారద టెక్కలికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్నివిధాలుగా సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



పూడికలు తొలగిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని గేదెలపేట గ్రామ సమీపంలో మద్దువలస ప్రధాన కాలువలో ఉన్న పూడికలను ముమ్మరంగా సోమవారం తొలగించారు. మద్దువలస ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న పెంట నుంచి గేదెలపేట వరకు కాలువలో పేరుకుపోయిన పూడికల తొలగిస్తున్నారు. నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయలక్ష్మి పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో దత్తేశ్వరానంద స్వామిజీ



స్వామిజీకి ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని కుర్తల్లాం పీఠ ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి స్వామిజీ సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్వామిజీ భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు.

కూర్మనాథుని సన్నిధిలో...

గార: ఆదికూర్మ క్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథున్ని కుర్తల్లాం పీఠ ఉత్తరాధికారి దత్తేశ్వరానంద స్వామిజీ సోమవారం దర్శించుకున్నారు. అర్చకులు వేద మంత్రాలతో ఎదురేగి స్వాగతం పలికారు. మూల విరాట్‌కు పూజలనంతరం లక్ష్మీ సన్నిధిలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహాత్యాన్ని తెలియజేశారు. స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, దాసుబాబు, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం



రక్తదానం చేస్తున్న అదానీ గ్రూప్ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌లో అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ పుట్టినరోజు పురస్కరించుకొని జిల్లా స్మార్ట్ మీటరింగ్ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ హెడ్ జై.ప్రకాష్, డివిజనల్ హెడ్ మనోహర్ మాట్లాడుతూ అదానీ గ్రూపు సేవా కార్యక్రమాలకు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, బి.సతీష్‌కుమార్, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలందుకుంటున్న బలగ ఉత్తరేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో ఉమాజడలేశ్వర స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు శివాలయాల్లో మాస శివరాత్రి పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. నక్కవీధిలోని ఉమాజడలేశ్వరస్వామి దేవాలయంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. బలగలోని ఉత్తరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మొండేటివీధిలో షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో లలితా సమేత శివకామేశ్వరస్వామికి అభిషేకాలు, అలంకరణ చేశారు. అలాగే నందీశ్వరునికి కూడా పూజలు నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ఎస్.లిఖిత



కె.కుసుమశ్రీ



దివ్య



గిరిజ

జి.సిగడాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన ఇద్దరు బాలికలు ట్రిపుల్ ఐటీలో సీట్లు కైవసం చేసుకున్నారు. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో ఎస్‌పీఆర్‌పురం గ్రామానికి చెందిన ఎం.దివ్య నూజివీడు, నిద్దాం గ్రామానికి చెందిన బి.గిరిజ శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం బీవీఎల్ నర్సింహంమూర్తి తెలిపారు. వీరిని పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక కేజీబీవీలో పదో తరగతి చదివిన ఇద్దరు విద్యార్థినులు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. 578 మార్కులు సాధించిన కె.కుసుమశ్రీ, 570 మార్కులు సాధించిన ఎస్.లిఖిత లు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ బి.సుధ, సిబ్బంది అభినందించారు.

ఎస్ఎల్ఆర్ లేకపోవడంతో ఇబ్బందులు



ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ రమేష్ నాయుడు

జి.సిగడాం:

మండలంలోని డీఆర్‌వలస గ్రామ రెవెన్యూ రికార్డు (ఎస్ఎల్ఆర్) లేకపోవడంతో రైతులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని డీఆర్‌వలస ఎంపీటీసీ సభ్యుడు కుమరాపు రమేష్‌నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఎల్ఆర్ రికార్డు లేకపోవడంతో భూముల వివరాలు తెలియడం లేదని పేర్కొన్నారు. గ్రామస్తులు కనీసం ఇళ్లు నిర్మించుకోవడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రవేశ పరీక్ష నేడు

జి.సిగడాం: స్థానిక ఆంధ్రప్రదేశ్ మోడల్ పాఠశాలలో మిగిలిన సీట్లు భర్తీకి అర్హులైన విద్యార్థులకు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్ సోమవారం తెలియజేశారు. విద్యాలయంలో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.

గుర్తింపు కార్డులు తీసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

జి.సిగడాం: అర్హత ఉన్న కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని తహసీల్దార్ మహాదేవు సరిత సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి బాజ్జినాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

మోసంపై మండిపాటు



బైక్‌ర్యాలీ చేస్తున్న యువత



ర్యాలీగా వెళ్తున్న దృశ్యం



యువత పోరులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూటమి పాలనలో తమకు జరిగిన అన్యాయంపై యువత, విద్యార్థులు, నిరుద్యోగులు గర్జించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువత పోరు నిరసనలో పెద్ద ఎత్తున పాల్గొని నినదించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో కళింగ రోడ్డు నుంచి బయల్దేరి మహాత్మా జ్యోతిరావుపూలే పార్కు వరకు ర్యాలీగా వెళ్లారు. జోరు వానను సైతం లెక్కచేయకుండా భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. యువత, విద్యార్థులకు చేసిన మోసాలపై నినాదాలు చేశారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/రణస్థలం



రణస్థలం: యువత పోరులో రణస్థలం యువత



రణస్థలం: యువత పోరులో పాల్గొన్న నాయకులు